జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 19-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 759 పేజీలు: 4 వెల : రూ.7

## త్రిమూర్తుల కనుసన్నల్లోనే..

# అక్రమ నిర్మాణాలు



☼ 'వర్ధనుడు' లీలలు 'శ్రీనివాస' 'ప్రేమ'లకే ఎరుక ☼ పలాసలో అక్రమ కట్టడాలపై కొరవడిన పర్యవేక్షణ ☼ టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుపై అనుమానాలు ☼ నిబంధనలు ఉల్లంఘించినా చర్యల మాటేలేదన్న విమర్శలు

**పలాస, ఆగస్టు 18 (వార్త):** పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు, నిర్మాణ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయంటూ కొన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "త్రిమూర్తుల" కనుసన్నల్లో కొన్ని నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. అయితే "వర్ధనుడు" లీలలు "శ్రీనివాస" "ప్రేమ"కే ఎరుకా అని పట్టణవాసులు గుసగుసలాడుకుంటున్నారు.

### అనుమతులు.. పరిశీలనలు ఏ మేరకు?

మున్సిపల్ పరిధిలో భవన నిర్మాణానికి ముందుగా సంబంధిత అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, రహదారి వెడల్పు, పార్కింగ్, భవన వినియోగం తదితర అంశాలను పరిశీలించడం టౌన్‌ప్లానింగ్ విభాగం బాధ్యత. నిర్మాణం ప్రారంభమైన తర్వాత కూడా అనుమతులకు అనుగుణంగానే పనులు సాగుతున్నాయా? లేదా? నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేస్తున్నారా? అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. కేవలం అనుమతి మంజూరు చేయడంతో బాధ్యత ముగిసిపోదని, నిర్మాణ దశలోనూ పర్యవేక్షణ అవసరమని పట్టణవాసులు పేర్కొంటున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే నోటీసులు జారీ చేయడం, అవసరమైతే పనులు నిలిపివేయడం, చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకోవడం వంటి ప్రక్రియను అధికారులు అమలు చేయాల్సి ఉంటుంది.

### కమిషనర్ అజమాయిషీ కీలకం..

టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ స్థాయిలో సమగ్ర సమీక్ష జరపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పట్టణంలోని నిర్మాణ అనుమతుల వివరాలు, అనుమతి పొందిన భవనాలు, వాటి ప్రస్తుత నిర్మాణ పరిస్థితి, జారీ చేసిన నోటీసులు, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు తదితర అంశాలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రత్యేకంగా వివాదాస్పదంగా మారిన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అనుమతి పత్రాల్లో ఉన్న వివరాలతో వాస్తవ నిర్మాణాన్ని సరిపోల్చాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైతే ఉన్నతాధికారులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నివేదిక రూపొందించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

### ఆరోపణలపై స్పష్టత ఇవ్వాల్సిందే..

"త్రిమూర్తుల కనుసన్నల్లో అక్రమ కట్టడాలు సాగుతున్నాయి" అనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు వాస్తవాలను ప్రజలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. నిజంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. పట్టణ ప్రణాళిక అనేది భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేయాల్సిన వ్యవస్థ కళ్లుమూసుకుందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం టౌన్‌ప్లానింగ్ విభాగంపై సమగ్ర పర్యవేక్షణ చేపట్టి, అక్రమ నిర్మాణాలపై పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఇప్పిలి దంపతుల ఆపన్న హస్తం

**కంచిలి, ఆగస్టు 18 (వార్త):** కంచిలి జడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి దంపతులు.. బోన్‌మ్యారో సమస్యతో బాధపడుతున్న బాధితునికి ఆపన్న హస్తం అందించారు. బూరగాం గ్రామానికి చెందిన దూపాన మాధవరావు అనే యువకుడు గత ఐదు నెలలుగా ఈ సమస్యతో బాధపడుతూ ఇప్పటికే 9 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. నిరుపేద కుటుంబం కావడంతో వెల్లూరులో గల క్రిస్టియన్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం సుమారు 20 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని తెలుస్తోంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఇప్పిలి లోలాక్షి, కృష్ణారావు దంపతులు మంగళవారం బూరగాం వెల్లి బాధిత కుటుంబానికి పదివేల రూపాయల సహాయం అందజేశారు. దీని పట్ల ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ..
# చారిత్రాత్మక నిర్ణయం



**-బీసీల రాజకీయ సాధికారతే లక్ష్యం**

**-కూటమి ప్రభుత్వ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు**

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, ఆగస్టు 18 (వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంగళవారం అమరావతిలోని శాసనసభలో ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ఆమె స్వాగతించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం, దివంగత నందమూరి తారక రామారావు నాయకత్వం నుంచి బీసీ వర్గాలకు రాజకీయంగా ప్రాధాన్యత పెరిగిందని తెలిపారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఇతర స్థానిక సంస్థల్లో బీసీలకు అవకాశాలు కల్పించడం ద్వారా రాజకీయంగా బలమైన పునాది ఏర్పడిందన్నారు. బీసీలు కేవలం ఓటర్లుగా కాకుండా నాయకులుగా ఎదిగి నిర్ణయాధికారంలో భాగస్వాములు కావాలనే ఆలోచనకు టీడీపీ ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో మరింత ప్రాధాన్యత ఇస్తుందని, చంద్రబాబు నాయుడు పాలనలో ఎన్టీఆర్ వారసత్వాన్ని కొనసాగిస్తూ బీసీల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. బీసీ కార్పొరేషన్లు, సంక్షేమ పథకాలు, వృత్తి ఆధారిత వర్గాలకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాల ద్వారా ఆయా వర్గాలకు అండగా నిలిచారని వివరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించాలనే నిర్ణయం కేవలం రిజర్వేషన్ అంశం కాదని, బీసీల రాజకీయ హక్కులు, ఆత్మగౌరవం, నాయకత్వానికి గుర్తింపు ఇచ్చే చర్య అని అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో గణనీయమైన భాగంగా ఉన్న బీసీల రాజకీయ సాధికారతకు ఇది కీలక ముందడుగన్నారు. గతంలో రిజర్వేషన్ల కోతతో నష్టం గత ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో వేలాది మంది బీసీలు రాజకీయ పదవులను కోల్పోయారని ఆమె ఆరోపించారు. సుమారు 16,800 మంది బీసీ ప్రతినిధులు పదవులకు దూరమయ్యారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు సంక్షేమంతో పాటు రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 136 బీసీ కులాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి వారి అభివృద్ధికి టీడీపీ కృషి చేసిందని తెలిపారు.

### మేనిఫెస్టో.. హామీల అమలు

ఎన్నికల సమయంలో యువనేత నారా లోకేశ్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. బీసీల రాజకీయ సాధికారతతో పాటు విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

### బీసీల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధి

బీసీలు అభివృద్ధి చెందితేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బీసీల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి, బీసీల సాధికారతే సామాజిక సాధికారత అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల నిర్ణయానికి సభ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు.

## రీ సర్వే భూములకు నోటీసులు ఇవ్వాలి

**అఖిలభారత కిసాన్ మహాసభ డిమాండ్**

**పలాస, ఆగస్టు 18 (వార్త):** రీ సర్వే పూర్తయిన భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేసే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, భూముల వివరాల్లో ఉన్న తప్పొప్పులను సరిచేయాలని అఖిలభారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం బొడ్డపాడు సచివాలయంలో పంచాయతీ అధికారి రేవతిపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 ఏళ్ల క్రితం నిర్వహించిన భూ సర్వేల్లో పలువురు రైతుల పేర్లు భూమి రికార్డుల్లో నమోదు కాకపోవడంతో వారు రైతు భరోసా వంటి ప్రభుత్వ ప్రయోజనాలను కోల్పోతున్నారని తెలిపారు. ఇటీవల చేపట్టిన రీ సర్వే ద్వారా కొంతమేర సమస్యలకు పరిష్కారం లభించినప్పటికీ, రికార్డుల సవరణ కోసం రైతులు అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రీ సర్వేలో గుర్తించిన భూముల వివరాలను ముందుగా రైతులకు తెలియజేసి, వారి అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం తుది రికార్డులు రూపొందించాలని సూచించారు. ఈ అంశంపై జిల్లా రైతులంతా అప్రమత్తంగా ఉండాలని మద్దిల రామారావు పిలుపునిచ్చారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దిల రాజారావు, మెట్టూరి అప్పారావు, సార ప్రసాద్, దేవరాజు, మల్లేశ్వరరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## పలాస మినీ స్టేడియం పనులు త్వరగా పూర్తిచేయాలి

**- శాప్ చైర్మన్ రవి నాయుడును కోరిన ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, ఆగస్టు 18 (వార్త):** పలాస నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం శాప్ చైర్మన్ రవి నాయుడును కలిశారు. ఈ సందర్భంగా పలాసలో 2019లో ప్రారంభమైన మినీ స్టేడియం నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తికాక అసంపూర్తిగా ఉండటంపై చర్చించారు. మినీ స్టేడియం నిర్మాణం పూర్తయితే పలాస ప్రాంతంలోని క్రీడాకారులు, యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు శాప్ ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేసి, నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని రవి నాయుడును కోరారు. పలాస ప్రాంతంలో క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించడంతో పాటు యువతకు మెరుగైన క్రీడా సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం తరపున కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు.

## రాజకీయ కక్షతో కేసు సరికాదు

**- పలాసలో అప్పలరాజును పరామర్శించిన డాక్టర్ కోదండరాం**

**- ఉద్దానం ప్రజలకు అప్పలరాజు సేవలు మరువలేనివి**



**పలాస, ఆగస్టు 18 (వార్త):** జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజును జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఉలాల కోదండరాం యాదవ్ మంగళవారం పలాసలో పరామర్శించారు. ఆయనకు సంఘీభావం తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటనను హత్య కేసుగా చిత్రీకరించి అప్పలరాజుపై కేసు నమోదు చేసి 23 రోజులు జైలులో ఉంచడం సరికాదని కోదండరాం అన్నారు. వైద్యులు ప్రాణాలు కాపాడేవారే తప్ప ప్రాణాలు తీసేవారు కాదని తెలిపారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, వ్యక్తిగత కక్షతో కేసులు పెట్టడం సబబు కాదన్నారు. వైద్యుడిగా, మంత్రిగా ఉద్దానం ప్రాంత ప్రజలకు అప్పలరాజు చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారానికి అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రాంతానికి తీసుకువచ్చి బాధితులతో సమావేశం ఏర్పాటు చేయించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.

పలాసలో కిడ్నీ పరిశోధనా కేంద్రంతో పాటు 200 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేశారని, కిడ్నీ బాధితులకు మందుల ఖర్చుల కోసం నెలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించే పథకం అమలుకు కూడా శ్రమించారని తెలిపారు. ఉద్దానం ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ అప్పలరాజు 'నడిచే దేవుడు'గా పేరు తెచ్చుకున్నారని కోదండరాం పేర్కొన్నారు. అప్పలరాజు జైలుకు వెళ్లిన సమయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసనలు, నిరాహార దీక్షలు నిర్వహించి, గంగమ్మ తల్లికి పూజలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని అప్పలరాజుకు సంఘీభావం తెలిపారు.

## భక్తుల దాహార్తి తీర్చేందుకు ప్యూర్ వాటర్‌మిషన్

**- పురుషోత్తపురం శివాలయంలో శుద్ధజల సౌకర్యం**

**- 31వ వార్డు ఇంచార్జి కరికన శంకర్‌రావు**



**పలాస, ఆగస్టు 18 (వార్త):** పురుషోత్తపురం శివాలయం ప్రాంగణంలోని శ్రీ శతాబ్దయ్య స్వామి దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం శుద్ధజల సదుపాయం కల్పించారు. మంగళవారం 31వ వార్డు ఇంచార్జి కరికన శంకర్‌రావు తన సొంత నిధులతో ప్యూర్ వాటర్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయానికి భక్తుల రాక పెరిగిన నేపథ్యంలో వారికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు శంకర్‌రావు తెలిపారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్యూర్ వాటర్ మిషన్‌ను మంగళవారం ప్రారంభించారు. దేవాలయంకు వచ్చే భక్తులకు సదుపాయం కలిపిస్తూ ఇచ్చాపురం, పలాస, పాతపట్నం నియోజకవర్గాల పరిధి నుంచి ప్రతిమంగళవారం భక్తులు ఈ దేవాలయానికి వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేందుకు శుద్ధజల సదుపాయం కల్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు అందించడమే సంకల్పంగా భావించి భక్తుల రద్దీ దృష్ట్యా వారికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో ప్యూర్ వాటర్ మిషన్ ఏర్పాటు చేసినట్లు శంకర్‌రావు తెలిపారు. భక్తులకు అవసరమైన ఇతర సదుపాయాలను కూడా కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ం

భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు శివయ్య, శతాబ్దయ్య స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నట్లు శంకర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే ధ్యేయం




*** ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు * ఘనంగా 7వ జిల్లా మహాసభలు**

**శ్రీకాకుళం, ఆగస్టు 18 (వార్త):** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ పనిచేస్తుందని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు అన్నారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఉన్న ప్రెస్‌క్లబ్‌లో ఏపీడబ్ల్యూజేఎఫ్ 7వ జిల్లా మహాసభ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేంతవరకు తమ సంఘం ప్రశ్నిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 4న 2000 మంది జర్నలిస్టులతో విజయవాడలో నిర్వహించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ భారీ ర్యాలీ, సభ ద్వారా ప్రభుత్వానికి నివేదించిన అంశాల్లో కొన్ని పరిష్కారమయ్యాయన్నారు. జర్నలిస్టులకు రక్షణ చట్టం, పింఛను అమలు కోసం పోరాడుతూనే ఉంటామన్నారు. కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావం నుంచి జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం పనిచేస్తుందని, మరికొన్ని డిమాండ్లు సాధించుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు సత్తారు భాస్కరరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి జి.లక్ష్మణరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.ఆనందరావు, పోతన్నదొర, బగాది వాసుదేవరావు, ఎం.ప్రసాదరావు, భీమారావు, ఎస్.విజయ్‌కుమార్, అల్లు వెంకటరమణ, ఏపీబీజేఏ విశాఖ జిల్లానేతలు మదన్, జగన్మోహన్, డీజేఎఫ్ వ్యవస్థాపకులు డా.బొడ్డేపల్లి ప్రసాదరావు, జర్నలిస్టుల జేఏసీ నేతలు ఎస్.జోగినాయుడు, ఎన్.ఈశ్వరరావు, గజ్జి షణ్ముఖరావు, సూరు చంద్రశేఖర్, డోల అప్పన్న, డోల శంకరరావు, తిత్తి ప్రవీణ్, హేమసుందర్, భాసూరు సాయి తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రముఖ మెజీషియన్, హిప్నాటిస్ట్ బేతా శ్రీనివాసరాజు ఇంద్రజాల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఇటీవల జాతీయస్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికైన కె.జయశంకర్‌ను అతిథులు ఘనంగా సత్కరించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నికఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా డి.ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా టి.భీమారావు, ఉపాధ్యక్షులుగా డి.నందికేశ్వరరావు, జి.రామారావు, బి.సాయి, కోశాధికారిగా కె.శివశంకర్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.ఎస్ ప్రకాశరావు, ఎం.సుదర్శన్, పి.శోభన్, వై.రాముతో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. జాతీయ కౌన్సిల్ సభ్యులుగా సత్తారు భాస్కరరావు, పేడాడ పరమేశ్వరరావు, కొంక్యాన వేణుగోపాల్, గరుకు లక్ష్మణరావు ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎస్.మురళి, కె.ప్రసాద్, ఎ.వి రమణ, జి.భాస్కరరావు, కె.సుదర్శనరావు, బి.వాసుదేవరావు, ఎం.ప్రసాద్, ఐ.పోతన్నదొరను ఎన్నికయ్యారు. వెల్ఫేర్ కమిటీ కన్వీనర్‌గా సదాశివ కృష్ణ, కో కన్వీనర్‌గా జి.మన్మథరావు, క్రమశిక్షణా సంఘం కమిటీ కన్వీనర్‌గా జి.నర్సింగరావు, పి.రమణను ఎన్నుకున్నారు. శ్రీకాకుళం అర్బన్ కమిటీ అధ్యక్షులుగా పి.శ్రీరామ్ కుమార్, కార్యదర్శిగా ఎస్.విజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా టి.రామకృష్ణ, కె.ఈశ్వరరావు, కోశాధికారిగా ఆర్.భాస్కర్, సంయుక్త కార్యదర్శులు ఆకుల కృష్ణ, పి.శంకర్ ఎన్నికయ్యారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

**శ్రీకాకుళం**



# ఇచ్ఛాపురంలో పక్కదారి పడుతున్న ఎరువులు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 18 (వార్త):** ఇచ్ఛాపురం మండలం బిర్లంగి గ్రామం లో రైతులకు అందివ్వవలసిన ఎరువులు తెలుగుదేశం పార్టీ నేతల ఇళ్ళకి చేర్చి దమ్ములు చేసి ఎరువుల కోసం ఎదురు చూస్తున్న అర్హులైన రైతులకు ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిర్లంగి గ్రామం చివరన వున్న రైతు సేవా కేంద్రానికి చేరవలసిన 200 బస్తాల యూరియా గ్రామానికి మధ్యలో వున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ కుటుంబానికి చెందిన గోడౌన్ లో దింపి, అక్రమ మార్గంలో అమ్ముకోడానికి చేసే ప్రయత్నంలో భాగమే రైతుల చెందిన ఎరువులు అక్రమ నిల్వ అని శ్యామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించలేని కూటమి ప్రభుత్వం, వచ్చిన ఎరువులను సైతం తెలుగుదేశం పార్టీ నేతలకు అందించి రైతులకు కూటమి నాయకులు రైతులకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శాసనమండలి లో ప్రతిపక్ష నాయకుడు, వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యన్నారాయణ ని అసభ్యమైన పదం తో సంభోదించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రైతుల ఎరువులను ప్రక్కదారి పట్టించిన శాఖకు మంత్రిగా వున్న మీకు ఎలా సంభోదించాలో? ఇప్పుడు చెప్పండి అని ఎద్దేవా చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి స్వంత జిల్లాలో ఎరువులు అక్రమ నిల్వ చేయడాన్ని మంత్రి ఎలా సమర్ధించుకుంటారో తెలపాలని నిలదీశారు.

గత వైస్సార్సీపీ ప్రభుత్వం లో వున్న ఉచిత వ్యసాయ భీమా పథకాన్ని నిలిపివేసిన కూటమి ప్రభుత్వం నేడు అసెంబ్లీ సమావేశం జీరో అవర్ లో స్థానిక ఎంఎల్ఏ వ్యవసాయ భీమా గురించి మాట్లాడడం విడ్డురంగా ఉందని శ్యామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం లో గత 40 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ వ్యవసాయ రంగాన్ని, సాగునీటి వ్యవస్థలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇచ్ఛాపురం నియోజకవర్గం వ్యవసాయరంగం బీడు గా మార్చారన్నారు. అసెంబ్లీ సంబంధిత శాఖ నుండి కనీసం సమాదానం కూడా రాని జీరో అవర్ లో ఇచ్ఛాపురం ఎంఎల్ఏ సాగునీటి గురించి, రైతాంగం గురించి మాట్లాడడం దెయ్యాలే వేదాలు వల్లించినట్లుందని శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఎద్దేవా చేశారు.

సమావేశం లో వైస్సార్సీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, మాజీ డీసీఎంస్ అధ్యక్షులు సల్ల దేవరాజు, ఇచ్ఛాపురం మండలం పార్టీ అధ్యక్షులు ఆశి



కృష్ణారెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్, నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ సాలిన గాంధీ,మాజీ జడ్పీటీసీ, జిల్లా రైతు విభాగం కార్యదర్శి దక్కత నూకయ్య రెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షులు కారింగి త్రినాధ్, జిల్లా సంస్కృతిక విభాగం కార్యదర్శి సాడి దుర్యోధన రెడ్డి పాల్గొన్నారు.

## శ్వేతనాగును చాకచక్యంగా బంధించిన స్నేక్ క్యాచర్



**పలాస, ఆగస్టు 18 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అన్నపూర్ణ ఆశ్రమం వీధిలో శివజ్యోతి ఇంటి సమీపంలో సంచరిస్తున్న భారీ శ్వేతనాగును స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడి మంగళవారం మధ్యాహ్నం చాకచక్యంగా బంధించారు. గత కొద్ది రోజులుగా ఎలుకల కోసం పరిసర ప్రాంతాల్లో తిష్ట వేసిన ఈ పాము సంచారంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడి అక్కడికి చేరుకుని ఎలాంటి హాని కలగకుండా పామును బంధించారు. ఓంకార్ త్యాడి పలాస రైల్వే స్టేషన్, టీటీఈ కార్యాలయంతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వందలాది పాములను పట్టుకుని అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టారు. జంతు సంరక్షణలో భాగంగా ఆయన అందిస్తున్న సేవలకు పలువురి ప్రశంసలు లభిస్తున్నాయి. ఈస్టర్న్ ఘాట్స్ వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడిగా అటవీ శాఖకు అనుబంధంగా ఆయన సేవలు అందిస్తున్నారు. ఓంకార్ త్యాడి సేవా కాలం ఈ నెల 14వ తేదీతో పూర్తయిన నేపథ్యంలో, ఆయన సేవలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. పలాస-కాశీబుగ్గ ప్రాంతాల్లో పాముల సంచారం ఎక్కువగా ఉన్నందున, ప్రజల భద్రత దృష్ట్యా ఆయన సేవలను కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగిగా ఉంటూనే ప్రజలకు, మూగజీవులకు ఉచితంగా సేవలందిస్తున్న ఓంకార్ త్యాడి కృషిని జంతు ప్రేమికుల సంఘం సభ్యులు హనుమంతు, మురళీమోహన్, లలిత కళారంజిని అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్దాన సాహితీ సాంస్కృతిక సంస్థ సభ్యులు అభినందించారు. సోషల్ మీడియా వేదికగా పలువురు ఆయన సేవలను ప్రశంసించారు.

# పలాసలో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం




**పలాస, ఆగస్టు 18 (వార్త):** కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు. శ్రీ సత్యసాయి సేవాసమితి, పలాస పర్యవేక్షణలో శంకర్ ఫౌండేషన్, విశాఖపట్నం ఆధ్వర్యంలో మంగళవారం పలాసలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు.

శిబిరంలో వైద్యులు నేత్ర పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలున్న వారికి అవసరమైన వైద్య సూచనలు అందించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి తదుపరి చికిత్సకు మార్గనిర్దేశం చేశారు. కంటి చూపులో మార్పులు, మంట, నీరు కారడం, తలనొప్పి వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఇప్పలి తిరుమల, సేవాదళ్ సభ్యులు డోకి జగదీష్, తాలాసు శ్రీనివాసరావు, తర్లనా రాజేష్, మల్ల రామేశం తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలి

**సోంపేట, ఆగస్టు 18 (వార్త):** సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు ఆకాంక్షించారు. జర్నలిస్టుగా పనిచేస్తున్న త్రినాథ్ పట్నాయక్ స్వగ్రామం బ్రాహ్మణ కొర్లాం మంగళవారం వెళ్లి పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో త్రినాథ్ కు తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళం లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసు ఆయన ఆరోగ్యం పరిశీలించి రిపోర్ట్ లు తనిఖీ చేశారు. కొద్దిరోజుల పాటు జాగ్రత్తగా ఇంటి వద్ద ఉంటూ చక్కగా మందులు వాడుకోవాలని సరైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి వైద్యుడు బి.షణ్ముఖరావు, జర్నలిస్ట్ నరేష్, పైడి పట్టాభి, తామద మోహన రావు తదితరులు పాల్గొన్నారు.



# ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1 సజావుగా నిర్వహించాలి



- విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు
- నరసన్నపేట బోర్డు జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షల పరిశీలన
- మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్ఎంకు ఎంఈవో సూచన

**నరసన్నపేట, ఆగస్టు 18 (వార్త):** నరసన్నపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలను పకడ్బందీగా, సజావుగా నిర్వహించాలని ఎంఈవో పేడాడ దాలినాయుడు సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠశాలల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. మంగళవారం నరసన్నపేట మండల కేంద్రంలోని స్థానిక బోర్డు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్--1 పరీక్షలను ఎంఈవో పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరును, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన స్వయంగా పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు తాగునీరు, సరైన వాతావరణం, అవసరమైన తరగతి గదుల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావుకు సూచించారు. పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ నిబంధనలను పాటిస్తూ, విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని తెలిపారు. అలాగే పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని, విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ తదితర అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిమడాం

- గ్రామస్థులు, విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ సేవలు
- నమోదు, చిరునామా మార్పులకు అవకాశం
- రెండు రోజుల పాటు అందుబాటులో ప్రత్యేక కేంద్రం



**జలుమూరు, ఆగస్టు 18(వార్త):** జలుమూరు మండలం తిమడాం సచివాలయ కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కే. చిన్నమ్మడు మంగళవారం తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు పొందేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక కేంద్రంలో కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవడంతో పాటు ఆధార్‌లో చిరునామా మార్పులు, అవసరమైన ఇతర వివరాల సవరణలకు సంబంధించిన సేవలను పొందవచ్చని ఎంపీడీవో తెలిపారు.

ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు తమ ఆధార్ వివరాల్లో మార్పులు, సవరణలు అవసరమైతే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కేంద్రం రెండు రోజుల పాటు అందుబాటులో ఉంటుందని ఆమె వెల్లడించారు. నిర్ణీత వ్యవధిలో ఆధార్‌కు సంబంధించిన పనులు పూర్తి చేసుకునేందుకు గ్రామస్థులు, విద్యార్థులు ఈ ప్రత్యేక కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సమయం, ప్రయాణ వ్యయాన్ని ఆదా చేయవచ్చని అధికారులు తెలిపారు.

## కరవంజ ఏపీ మోడల్ స్కూల్‌లో
# గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- పీజీటీ సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ పోస్టులకు ఖాళీలు
- పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో పాటు బీఈడీ తప్పనిసరి
- 21లోగా దరఖాస్తులు సమర్పించాలి

**జలుమూరు, ఆగస్టు 18 (వార్త):** జలుమూరు మండలం కరవంజ ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. పాఠశాలలో పీజీటీ సివిక్స్, పీజీటీ ఎకనామిక్స్, పీజీటీ కామర్స్ విభాగాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండటంతో పాటు బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో పాటు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను జతచేసి ఆగస్టు 21, 2026లోగా నేరుగా కరవంజ ఏపీ మోడల్ స్కూల్‌కు సమర్పించాలని ప్రిన్సిపాల్ సూచించారు. నిర్ణీత గడువు అనంతరం అందే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు. గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మరిన్ని వివరాల కోసం కరవంజ ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను 9440322964 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# వార్డు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

- రానున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి
- బల్ల గిరి బాబు

**పలాస, ఆగస్టు 18 (వార్త):** ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ ధ్యేయమని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్లగిరి బాబు అన్నారు. అన్నపూర్ణ ఆశ్రమం వీధిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. వార్డులో పారిశుద్ధ్య వ్యవస్థ సక్రమంగా లేదని, వీధి దీపాలు సరిగా వెలగక రాత్రివేళల్లో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని బల్లగిరి బాబు తెలిపారు. చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసన, దోమల బెడద పెరుగుతోందన్నారు. పలు కాలనీల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షాల సమయంలో మురుగునీరు రోడ్లపై నిలుస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందన్నారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. వార్డులోని సమస్యలను మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బల్లగిరి బాబు హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.



## ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడానికి పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని బల్లగిరి బాబు పిలుపునిచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎరుకోళ్ల వెంకటరమణ, సనపల చెన్నారావు, మాజీ కౌన్సిలర్ రోణంకి వెంకటరమణ, డి. నాగభూషణరావు, వల్లభ వైకుంఠరావు, వార్డుకు చెందిన యువకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఐదేళ్లు దాటిన పిల్లలకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

**సారవకోట, ఆగస్టు 18 (వార్త):** ఐదేళ్లు దాటిన పిల్లలకు ఆధార్ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేయించాలని డిప్యూటీ ఎంపీడీవో అనురాధ సూచించారు. ఆధార్ వివరాల నవీకరణలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె కోరారు. మంగళవారం సారవకోట మండలంలోని సారవకోట, కేళవలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను ఆమె పరిశీలించారు. కేంద్రాల్లో కొనసాగుతున్న ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను పరిశీలించి, పిల్లలకు సంబంధించిన వివరాల నమోదు, నవీకరణ సక్రమంగా జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సారవకోట మండల పరిధిలో ఐదేళు దాటిన 212 మంది పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయాల్సి ఉందని అనురాధ తెలిపారు. పిల్లలు, వారి తల్లిదండ్రులు ఒకే ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా సారవకోట, కేళవలస గ్రామాల్లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లల ఆధార్ వివరాలను సకాలంలో అప్‌డేట్ చేయించాలని ఆమె సూచించారు. ఆధార్ నవీకరణ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన పిల్లలందరికీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



# తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు పెంచాలి

- నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో అధికంగా ప్రసవాలు
- మూడు వాహనాల నుంచి ఒక్కటికి తగ్గింపుతో ఇబ్బందులు
- బాలింతలను సకాలంలో గమ్యస్థానాలకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**నరసన్నపేట, ఆగస్టు 18 (వార్త):** నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య అధికంగా ఉండటంతో గతంలో బాలింతలు, నవజాత శిశువులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు తరలించేందుకు మూడు తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను అందుబాటులో ఉంచారు. దీంతో ప్రసవం అనంతరం ఆసుపత్రి నుంచి ఇళ్లకు వెళ్లే బాలింతలకు రవాణా సౌకర్యం సులభంగా ఉండేది. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సంఖ్యను మూడింటి నుంచి ఒక్కటికి కుదించారు. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వాహనం ఒక్కటే ప్రస్తుతం అందుబాటులో ఉండటంతో, ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యే బాలింతలను వారి స్వగ్రామాలకు తరలించడంలో సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా గర్భిణులు ప్రసవాల కోసం వస్తుంటారు. ప్రసవాల సంఖ్యకు అనుగుణంగా రవాణా వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ఒక్క వాహనంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి పలువురు బాలింతలు డిశ్చార్జి అయితే వారిని గమ్యస్థానాలకు చేర్చేందుకు ఎక్కువ సమయం పడుతోందని పేర్కొంటున్నారు. ప్రసవం అనంతరం తల్లి, శిశువును సురక్షితంగా ఇంటికి చేర్చడం అత్యంత ముఖ్యమైన అంశమని, వాహనాల కొరత కారణంగా బాలింతలు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సంఖ్యను తిరిగి పెంచాలని సిబ్బంది, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎఫ్‌ఏ-1ను ఎంఈవో ఆకస్మిక తనిఖీ

- కురిడింగి పాఠశాలలో పరీక్షల నిర్వహణను పరిశీలించిన ఎంఈవో
- ప్రశ్నాపత్రాల్లో సవరణలు ఉంటే విద్యార్థులకు వెంటనే తెలియజేయాలని సూచన
- నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడి



**సారవకోట, ఆగస్టు 18 (వార్త):** ఫార్మేటివ్ అసెస్మెంట్ (ఎఫ్‌ఏ-1) పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించేందుకు సారవకోట మండలం కురిడింగి పాఠశాలను ఎంఈవో మద్దు వెంకటరమణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనలను పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీలో భాగంగా పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఎంఈవో క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రశ్నాపత్రాల్లో ముద్రణపరమైన పొరపాట్లు, సవరణలు లేదా విద్యార్థులకు స్పష్టత అవసరమైన అంశాలు గుర్తించినట్లయితే వాటిని వెంటనే విద్యార్థులకు తెలియజేసి పరీక్ష సజావుగా కొనసాగేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేలా పర్యవేక్షణ చేపట్టాలని, పరీక్షా నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆయన తెలిపారు. పరీక్షల సమయంలో క్రమశిక్షణతో పాటు సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మండల వ్యాప్తంగా ఎఫ్‌ఏ-1 పరీక్షలను పకడ్బందీగా, విద్యాశాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని ఎంఈవో మద్దు వెంకటరమణ తెలిపారు. పాఠశాలల్లో పరీక్షల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు.



# వరి సాగులో యూరియా వినియోగం తగ్గించాలి

- అధిక యూరియా వాడకంతో పంటకు నష్టం జరిగే అవకాశం
- బుడితిలో వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారి
- తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు

**సారవకోట, ఆగస్టు 18 (వార్త):** వరి సాగులో రైతులు యూరియా వినియోగాన్ని నియంత్రించాలని వ్యవసాయాధికారి వెంకటరావు సూచించారు. మంగళవారం సారవకోట మండలం బుడితి గ్రామంలో పలువురు రైతులకు చెందిన వరి పొలాలను ఆయన పరిశీలించి, పంట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటలో కనిపిస్తున్న వివిధ తెగుళ్లను గుర్తించిన వ్యవసాయాధికారి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు.

పంట ఎదుగుదలకు అవసరమైన మేరకే ఎరువులను వినియోగించాలని, మోతాదుకు మించి యూరియా వేయడం వల్ల కలిగే నష్టాలను రైతులు గుర్తించాలని సూచించారు. వరిలో అధికంగా యూరియా వినియోగించడం వల్ల మొక్కలు బలహీనంగా మారడంతో పాటు అధిక ఎత్తు పెరిగి నేలకొరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో చిన్నపాటి గాలులు వీచినా మొక్కలు పడిపోయి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రైతులు పంట పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని వెంకటరావు సూచించారు. శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువుల వినియోగం, సమగ్ర పంట యాజమాన్యంపై రైతులు దృష్టి సారించాలని కోరారు.

# నరసన్నపేటలో పందుల బెడద

- విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులతో పట్టణవాసుల అవస్థలు
- పారిశుధ్యంపై నిర్లక్ష్యంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ఎస్సీ బాలికల వసతి గృహం, ఏరియా ఆసుపత్రి పరిసరాల్లో తీవ్ర ఇబ్బందులు
- దుర్గంధంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం.. చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి



**నరసన్నపేట, ఆగస్టు 18 (వార్త):** నరసన్నపేట పట్టణంలో పందుల సంచారం రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందుల పెంపకందారులు వాటిని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహించడంతో పందులు వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పందులు గుంపులుగా తిరుగుతూ రహదారులు, నివాస ప్రాంతాలు, ప్రభుత్వ సంస్థల పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. దీనికితోడు ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా అంటువ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద పందులు తరచూ సంచరిస్తుండటంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. వసతి గృహం నుంచి బయటకు వచ్చేటప్పుడు పందులు ఎదురుపడుతుండటంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. అదేవిధంగా ఏరియా ఆసుపత్రి ప్రారంభం వద్ద కూడా పందులు సంచరిస్తుండటంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యసేవలు అందించే ప్రాంతంలోనే అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో పందుల నియంత్రణతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పందుల పెంపకందారులకు తగిన సూచనలు ఇచ్చి, వాటిని జనావాసాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి, వసతి గృహం వంటి కీలక ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నరసన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో
# ప్రయాణికుల సమస్యకు పరిష్కారం

- రాత్రి వేళల్లో ఫ్యాన్లు నిలిపివేస్తున్న సమస్యకు పరిష్కారం
- దెబ్బతిన్న స్టీల్ కుర్చీల స్థానంలో కొత్త కుర్చీల ఏర్పాటు
- ప్రయాణికుల సౌకర్యంపై ఆర్టీసీ అధికారుల స్పందనకు అభినందనలు



**నరసన్నపేట, ఆగస్టు 18 (వార్త):** నరసన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో రాత్రి వేళల్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించింది. బస్టాండ్‌లో రాత్రి 8 గంటల తర్వాత ఫ్యాన్లు నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, బస్టాండ్‌లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని పలువురు ప్రజలు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకుడు, 2024 శ్రీకాకుళం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నాయుడుగారి రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 11న మంగళవారం ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందుకున్న రాజశేఖర్ సమస్యలపై స్పందించారు. బస్టాండ్‌లో ప్రయాణికుల విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన స్టీల్ కుర్చీలు, బెంచీలకు సంబంధించిన కాళ్లు విరిగిపోవడంతో వాటి స్థానంలో ఇటుకలను అమర్చి తాత్కాలికంగా వినియోగిస్తున్న పరిస్థితిని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కుర్చీలపై కూర్చునే సమయంలో అవి అదుపుతప్పి ప్రయాణికులు కిందపడుతున్న ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలను తీవ్రంగా పరిగణించిన రాజశేఖర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌ను చరవాణి ద్వారా సంప్రదించి ప్రయాణికుల ఇబ్బందులను వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన రీజినల్ మేనేజర్ రాత్రి వేళల్లోనూ బస్టాండ్‌లో ఫ్యాన్లు పనిచేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం నుంచి రాత్రి వేళల్లోనూ ఫ్యాన్లు తిరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా దెబ్బతిన్న స్టీల్ కుర్చీల సమస్యను కూడా ఆర్టీసీ అధికారులు పరిష్కరించారు. ఈ నెల 17న పాడైపోయిన కుర్చీల స్థానంలో కొత్త స్టీల్ కుర్చీలను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు విశ్రాంతి తీసుకునేందుకు మెరుగైన సదుపాయం కల్పించినట్లయింది. ప్రయాణికుల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు ఆర్టీసీ అధికారులు స్పందించడం అభినందనీయమని రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఇదే విధంగా తక్షణ స్పందన చూపి బస్టాండ్‌లో మరిన్ని మౌలిక వసతులను మెరుగుపరచాలని ఆయన కోరారు.



# అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తాం

## ✻ పోలాకి జడ్పీటీసీ కృష్ణ చైతన్య ✻ చింతాడ రవికుమార్, సీదిరి అప్పలరాజుకు పరామర్శ



**ఆమదాలవలస/పలాస, ఆగస్టు 18 (వార్త):** అక్రమ కేసులకు భయపడేది లేదని, తాము అధికారంలోకి వచ్చాక అన్నింటినీ వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని వైఎస్ఆర్సిపి యువ నాయకులు, పోలాకి జడ్పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య స్పష్టం చేశారు. అక్రమ కేసుల్లో ఇరుక్కుని ఇటీవలే జైలు నుంచి విడుదలైన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలాసలోని ఆయన నివాసంలో, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ను ఆయన పార్టీ కార్యాలయంలో మంగళ వారం కృష్ణచైతన్య పరామర్శించారు. అనంతరం కృష్ణ చైతన్య మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడంలో కొత్త సంస్కృతికి తెర లేపిందన్నారు. ఇవి ఇక్కడితో ఆగే పరిస్థితి లేదన్నారు. విద్యావంతు డైన చింతాడ రవికుమార్ ను జగన్మోహన్ రెడ్డి వెన్నుతట్టి ప్రోత్సహించారన్నారు. అటువంటి వ్యక్తిపై మహిళా ఎస్సై విధులకు ఆటంకం కలిగించారని తప్పుడు కేసు పెట్టి జైల్లో నిర్బంధించా రన్నారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వ అరాచకాలకు పరాకాష్ట అన్నారు. వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చాక ఇంతకు రెండింతలు అనుభవిం చాల్సి వస్తుందన్న విషయాన్ని కూటమి నాయకులు గుర్తు ఎరగాలని హెచ్చరించారు. ఎల్లకాలం ఒకే పార్టీ అధికారంలో ఉండదన్నారు. గడిచిన ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల ను చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ప్రశ్నిస్తున్నందువల్లే వైఎస్ఆర్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. వీటికి భయపడేది లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఎంపీపీ ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగి నాయుడు, రాష్ట్ర పొందర కూరకుల విభాగం అధ్య క్షులు రాజపు అప్పన్న, నక్క తులసిదాస్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, రాష్ట్ర టీచర్స్ సెల్ కార్యదర్శి పారసెల్లి తేజేశ్వరరావు , రాష్ట్ర యూత్ కార్యదర్శి చింతు రాఘవ రావు,నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, జిల్లా ఎస్సీ సెల్ ఉప అధ్యక్షులు సతివాడ రామినాయుడు, జిల్లా విద్యార్థి విభాగం ఉప అధ్యక్షులు దుప్పట్ల పృధ్వీరాజ్,మండల అధ్యక్షులు లుకలాపు రవికుమార్, మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజ శేఖర్, రెంటికోట త్రినాధరావు , మండల విద్యార్థి విభాగం అధ్య క్షులు పాగోటి భరత్ కుమార్, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బోది ఈశ్వరరావు,చింతాడ ఉమా మహేశ్వరరావు, మండల బీసీ సెల్ అధ్యక్షులు చింతు రామకృష్ణ, మండల ట్రేడ్ యూనియన్ అధ్య క్షులు పెద్దిరెడ్ల రాము, పట్టణ అధ్యక్షులు పొట్నూరు సాయి ప్రసాద్, మండల ఉప అధ్యక్షులు నేతింటి రాజేశ్వరరావు,బొంగు కొండయ్య , మండల యూత్ ఉప అధ్యక్షులు తోట భార్గవ్,రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శి పంచిరెడ్డి శివ, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి కనపల అరవింద్,జిల్లా యూత్ కార్యదర్శి పాగోటి గోవింద, పొట్నూరు పృధ్వీరాజు, విష్ణుసాయి మల్లేష్, బాన్న శ్యామ్, చిట్టి రవి,అలిగి గణేష్, మార్పు శేఖర్, వైశ్యరాజు రాజు, మెండ రామక్రిష్ణ ఉన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546